

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

ఎడిటర్: చౌదరి, 9963063761



శుక్రవారం | 16-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 809 పేజీలు: 4 వెల : రూ.7




# తెర వెనుక వెన్నుపోట్లు..
# చేసింది మావాళ్లే!

- తప్పుడు ప్రచారాలు.. కుటుంబ క్షోభ
- భర్త మృతి తర్వాత.. నమ్మినే నేతలే దూరం పెట్టారు
- ప్రజలే తనను ముందుకునడిపిస్తున్నారన్న అమ్మ
- కుట్రల వలలో చిక్కుకుపోయానంటూ భావోద్వేగం
- అమెరికాలో ఉన్నత స్థానాల్లో బిడ్డలు
- రాజకీయాల్లో రావడం అనేది వారి ఇష్టానికే వదిలేశా
- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

శ్రీకాకుళం, అక్టోబర్ 15 (వార్త):ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లాది ఎప్పుడూ ప్రత్యేక స్థానం. ఇక్కడ జరిగే రాజకీయాలు కేవలం ఎన్నికల పోరుతో సరిపెట్టవు. వాటి వెనుక దశాబ్దాల చరిత్ర, నమ్మకాలు, ఆత్మాభిమానాలు, అలాగే తెరవెనుక జరిగే వెన్నుపోటు రాజకీయాల లోతైన గాయాలుంటాయి. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపిన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఓ ప్రైవేటు ఛానల్‌కి ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూలో తన రాజకీయ ప్రయాణం, ఎదుర్కొన్న కుట్రలు, వ్యక్తిగత వేదనలను నిక్కచ్చిగా పంచుకున్నారు.

## 'అజాత శత్రువు' లెగసీ.. అనూహ్య శూన్యత..

దివంగత ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ నాలుగుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయనతో పాటు లక్ష్మీదేవి కూడా ఎవరికీ శత్రువులు కారనే మంచి పేరు (అజాత శత్రువు) సంపాదించుకున్నారు. ఆమె రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఎమ్మెల్యేగా నిలిచి ఎంతోమంది ముక్కును వేలేసుకునేలా చేశారు. అయితే, ఆయన అకస్మిక మరణం ఆ కుటుంబంలోనే కాక, శ్రీకాకుళం రాజకీయాల్లోనూ ఒక పెద్ద శూన్యతను మిగిల్చింది. భర్త మరణం తర్వాత రాజకీయాలను ఒంటరిగా ఎదుర్కొనే క్రమంలో సొంత పార్టీలోనే కొందరు వ్యక్తులు తమను దూరం పెట్టారని, అది తమను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## 'నమ్మించి.. నొసటిపై వెన్నుపోటు'..

రాజకీయాల్లో శత్రువుల కంటే సొంత మనుషుల రూపంలో వచ్చే ముప్పే ప్రమాదకరమని లక్ష్మీదేవి నిరూపించారు. పార్టీ తరఫున తనకు సహాయం కోసం పంపిన ఓ వ్యక్తి, తన రాజకీయ వ్యూహాలను, గోప్యమైన సమాచారాన్ని ప్రత్యర్థులకు చేరవేస్తూ ద్రోహం చేశాడని ఆమె బహిరంగంగానే వెల్లడించారు. ఈ నమ్మకద్రోహం బయటపడిన తర్వాత, ఆమె రాజకీయాల్లో బయటి వ్యక్తులను నమ్మడం పూర్తిగా మానేశానని, తనను తాను రక్షించుకోవడానికి స్వశక్తిపైనే ఆధారపడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు, ర్యాలీలు వంటి పార్టీ కార్యక్రమాలను సైతం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా సొంత ఖర్చులతో నిర్వహించుకున్నట్లు ఆమె గుర్తుచేసుకున్నారు.

## తప్పుడు ప్రచారాలు..

కుటుంబ క్షోభతాను పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నానని, ప్రత్యర్థులతో చేతులు కలిపానని కొందరు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేశారని లక్ష్మీదేవి తీవ్రంగా ఖండించారు. తాను ఎప్పుడూ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. అయితే, ఈ నిరాధార ఆరోపణలు, తెరవెనుక జరిగే కుట్రల వల్ల తన పిల్లలు తీవ్రమైన మానసిక క్షోభకు గురయ్యారని, ప్రత్యర్థుల విమర్శల కంటే సొంతవారి వెన్నుపోటే తనను ఎక్కువగా బాధించిందని ఆమె ఆవేదన చెందారు. కుటుంబం పడుతున్న బాధను చూసి ఎన్నోసార్లు ఎదురుదాడి చేయకుండా మౌనాన్నే ఆశ్రయించినట్లు తెలిపారు.



## అమెరికాలో ఉన్నత స్థానాల్లో బిడ్డలు..

ఈ ఇంటర్వ్యూలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఆమె కుమారులు వారి భవిష్యత్తు గురించిన చర్చ సాగింది. పెద్ద కుమారుడు అమెరికాలో ఉన్నత ఉద్యోగంలో స్థిరపడగా, చిన్న కుమారుడు విశ్వనాథ్ అమెరికాలోనే సైంటిస్ట్‌గా, స్టేట్ కమిషనర్‌గా అత్యున్నత పదవిలో కొనసాగుతున్నారు. ప్రస్తుత ఆధునిక రాజకీయాలు విపరీతమైన ఖర్చుతో కూడుకున్నవిగా, వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లతో మలినమైపోయాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలోని ప్రశాంతమైన, గౌరవప్రదమైన వృత్తిపరమైన జీవితాన్ని వదిలిపెట్టి, ఈ సంక్షోభ రాజకీయాల్లోకి రావడానికి తన కుమారులు తీవ్రమైన మానసిక వేదనను ఎదుర్కొంటున్నారని, వారి ఎంట్రీని పూర్తిగా వారి వ్యక్తిగత ఇష్టానికే వదిలేశానని స్పష్టం చేశారు. ప్రజలు తనని కేవలం ఒక నాయకురాలిగా కాకుండా తమ కుటుంబ సభ్యురాలిగా చూస్తున్నారన్న ప్రేమే తనను ముందుకు నడిపిస్తోందని అన్నారు. శ్రీకాకుళం రాజకీయ రణరంగంలో ఒక సీనియర్ మహిళా నాయకురాలు ఎదుర్కొన్న ఒంటరి పోరాటం, నమ్మకద్రోహాలు, కుటుంబ నైతిక విలువలకు అద్దం పట్టే ఈ ఇంటర్వ్యూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్‌గా పోటీ చేస్తారా? అనే విషయమే ఆమె స్పష్టత ఇవ్వలేదు. చూద్దాం అనే ధోరణిలో ఆమె మాట్లాడారు. పార్టీ మారుతారా అనే విషయాన్ని కూడా ఆమె స్పష్టం చేయలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ చాలా మంచి వారని, మంచి లీడర్లని ఆమె చెప్పారు. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి ప్రస్తావన వచ్చినప్పుడు ఎందుకులెెండి సార్ అంటూ దాటవేశారు. మొత్తానికి ప్రైవేటు ఛానల్ కి ఇచ్చిన ఆమె ఇంటర్వ్యూ జిల్లా కేంద్రంలో కలకలం రేపిందనే చెప్పాలి.

## వైసీపీలోకి.. అమ్మ?

శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా గొండు లక్ష్మీదేవి బరిలోకి దిగుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఆమె వైసీపీలో చేరుతారని పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆమెతో ధర్మాన ప్రసాదరావు, జగన్మోహనరెడ్డిలు మాట్లాడారని కూడా, మేయర్ సీటు ఆమెకే కేటాయిస్తున్నట్టు పుకార్లు జోరందుకున్నాయి. గురువారం రాత్రి వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ పదవులకు గాను ఎవరు పోటీ చేస్తారన్న దానిపై స్పష్టత ఇచ్చింది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అభ్యర్థిగా పిలక రాజ్యలక్ష్మి, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అభ్యర్థిగా తాళాసు శ్రీపద్మ పేర్లను వైసీపీ అధిష్టానం ప్రకటించింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిపై ఇంకా స్పష్ట ఇవ్వలేదు.

## టీడీపీ ఆశావహులకు షాక్..

శ్రీకాకుళం మేయర్ పీఠంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు కూటమి సీట్ల సర్దుబాటు షాక్ ఇచ్చింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి స్థానాన్ని జనసేన పార్టీ దక్కించుకున్నట్లు సమాచారం. దీంతో నాలుగు దశాబ్దాలుగా ఈ పదవిపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లయిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య జరుగుతున్న స్థానాల పంపకాల్లో భాగంగా మేయర్ అభ్యర్థి స్థానాన్ని జనసేనకు కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో మేయర్ స్థానం తమకు దక్కుతుందని ఆశించిన టీడీపీ నాయకులు నిరాశకు గురయ్యారు. ఈ పీఠం తమకే దక్కుతుందని భావించిన అంధవరపు వరం ఫ్యామిలీకి గట్టి దెబ్బే తగిలింది. 2024 ఎన్నికల ముందు వరం కుటుంబం వైసీపీని వీడి టీడీపీలో చేరింది. శ్రీకాకుళం మేయర్ పీఠం జనసేనకు దక్కడంతో పట్టణ టీడీపీ నాయకులు నైరాశ్యంలో ఉన్నారు.



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ వైసీపీ అభ్యర్థిగా పిలక రాజ్యలక్ష్మి



పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసీపీ అభ్యర్థిగా తాళాసు శ్రీపద్మ

# మురుగు కాలువలో మృత పసికందు

- మొగిలిపాడులో వెలుగు చూసిన అమానుష ఘటన
- పోలీసుల దర్యాప్తు



పలాస, అక్టోబర్15 (వార్త): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడులో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. స్థానిక మురుగు కాలువలో గురువారం ఓ మగ శిశువు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృత శిశువును స్వాధీనం చేసుకున్నారు. కాలువలో శిశువు మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పరిసర ప్రాంతాల్లో ఆధారాలను సేకరిస్తూ ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. శిశువును ఎవరు, ఏ పరిస్థితుల్లో అక్కడ వదిలివెళ్లారనే అంశాలపై దర్యాప్తు చేపట్టారు. శిశువు మృతికి గల కారణాలు, ఘటన ఎప్పుడు జరిగిందనే వివరాలు విచారణ పోలీసులు కొనసాగిస్తున్నారు. లోకాన్ని చూడాల్సిన పసికందు ఇలా మురుగు కాలువలో మృతదేహంలా కనిపించడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నవమాసాలు మోసి జన్మనిచ్చిన బిడ్డను ఇలాంటి పరిస్థితుల్లో వదిలివేయడం పట్ల ఆవేదన చెందారు. ఈ ఘటనకు బాధ్యులెవరో గుర్తించి, వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నరసన్నపేట పీఠం దక్కేదెలా?

- పంచాయతీ పగ్గాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల కసరత్తు
- అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం
- టికెట్ ఆశావహుల నుంచి ఎమ్మెల్యే బగ్గుకు విజ్ఞప్తులు

**నరసన్నపేట, అక్టోబరు 15 (వార్త):** నియోజకవర్గంలో కీలకమైన నరసన్నపేట మేజర్ పంచాయతీ పగ్గాలను దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. స్థానికంగా రాజకీయ ప్రాధాన్యం కలిగిన ఈ పంచాయతీపై పట్టు సాధించేందుకు ఇరు పక్షాలు అభ్యర్థుల ఎంపికతో పాటు సామాజిక సమీకరణాలపై దృష్టి సారిస్తున్నాయి. మేజర్ పంచాయతీ పరిధిలో తమ బలాన్ని నిలబెట్టుకోవడంతో పాటు ప్రజల్లో ఆదరణ ఉన్న అభ్యర్థిని బరిలోకి దింపేందుకు పార్టీలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సామాజిక వర్గాల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపికపై చర్చలు సాగుతున్నాయి. వైశ్య సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని పోటీకి నిలబెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అధికార పార్టీ తరఫున అభ్యర్థి ఎంపిక ఇంకా కొలిక్కి రాలేదని తెలుస్తోంది. టికెట్ ఆశిస్తున్న పలువురు నాయకులు తమకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే బగ్గును కలిసి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. పార్టీ నాయకత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్న అంశంపై ఆశావహుల్లో ఆసక్తి నెలకొంది. పంచాయతీ




ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల మద్దతు కీలక అంశాలుగా మారుతున్నాయి. ప్రధాన పార్టీల వ్యూహాలు, అభ్యర్థుల ప్రకటనలపై స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఆయా పార్టీల నుంచి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది.

## ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి



**మందస, అక్టోబరు 15(వార్త):** ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరూ తప్పక పాటించాలని మందస తహసీల్దార్ బి.శ్రీహరి, ఎంపీడీఓ వై.వెంకటరమణ అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులుతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారుల పరిధిలో ఎటువంటి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుగరాదని ఆదేశించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎ.తిరుమలకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ స్థానిక సంస్థల

# ఎన్నికల విభాగం సభ్యుడిగా మామిడి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో నియామకం
- సత్యనారాయణకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అభినందనలు
- పార్టీకి మరిన్ని సేవలందించాలని ఆకాంక్ష

**నరసన్నపేట, అక్టోబరు 15 (వార్త):** జిల్లా కాంగ్రెస్ పార్టీలో మామిడి సత్యనారాయణకు కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల విభాగం సభ్యుడిగా ఆయనను ఎంపిక చేసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సనపల అన్నజీరావు వెల్లడించారు. పది మంది సభ్యులతో కూడిన ఈ విభాగంలో సత్యనారాయణకు చోటు కల్పించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తనను సభ్యుడిగా ఎంపిక చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సనపల అన్నజీరావుకు మామిడి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మామిడి సత్యనారాయణ ప్రస్తుతం నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా, జిల్లా పీఏసీ కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ ఆయనకు మరిన్ని ఉన్నత పదవులు అప్పగించి, ప్రజలకు మరియు పార్టీకి సేవలందించే అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంట కర్ణవీరుడు సైతం మామిడి సత్యనారాయణకు అభినందనలు తెలియజేశారు.



## ప్రపంచ సాహితీ మహోత్సవాలకు మార్పునకు ఆహ్వానం

**రాజమహేంద్రవరంలో జరుగనున్న సాహితీ మహోత్సవాలు**

**మందస, అక్టోబరు 15(వార్త):** ప్రపంచ సాహితీ మహోత్సవాల్లో పాల్గొనాలని మార్పు జగన్మోహనరావుకు ఆహ్వానం అందింది. ఉత్తమ కవి, రచయిత, ప్రజాసంఘాల నాయకుడు, అభ్యుదయవాది, ఉపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు మందస మండలంలోని బిన్నళమదనాపురంలో నివాసముంటున్నారు. 8వ ప్రపంచ సాహితీ మహోత్సవాలు నవంబరు ఒకటిన ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో జరగనున్నాయి. ప్రముఖకవి, రచయిత కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్ సారధ్యంలో ఈ మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకుల నుంచి మార్పునకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక, సేవా సంస్థ 8వ ప్రపంచ సాహితీ మహోత్సవాలు ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవాలకు పలువురు కవులు, సాహిత్యాభిమానులు, రచయితలు, కళాకారులు హాజరవుతారన్నారు. ప్రపంచ తెలుగు కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులు, పుస్తకావిష్కరణలు, కూచిపూడి నృత్యాలు, భరతనాట్యం, జానపద కళారూపాలు, ఏకపాత్రాభినయాలు ప్రదర్శింపబడతాయన్నారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖకవులు, సాహితీవేత్తలు, రచయితలు, కళాకారుల భాగస్వామ్యం ఉంటుందన్నారు.






# తిలారు రైల్వే అండర్‌పాస్‌లో వరద నీరు

- నీటిలో మునిగిన అండర్‌పాస్
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- చిన్నపాటి వర్షానికే భారీగా నిలిచిపోతున్న నీరు
- సమస్యను పరిష్కరించాలని అధికారులకు ప్రయాణికుల విజ్ఞప్తి



**జలుమూరు, అక్టోబరు 15 (వార్త):** తిలారు ప్రధాన రైల్వే గేటు దిగువన నిర్మించిన అండర్‌పాస్ వరద నీటితో నిండిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత రెండు రోజులుగా అండర్‌పాస్‌లో నీరు సుమారు మీటరు ఎత్తు వరకు నిలిచిపోవడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, చిన్నపాటి వాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిలారు రైల్వే గేటు కింద నిర్మించిన ఈ అండర్‌పాస్ వర్షాకాలంలో ప్రయాణికులకు సమస్యగా మారుతోంది. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు భారీగా చేరి నిలిచిపోతుండటంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు, వివిధ ప్రాంతాలకు ప్రయాణించే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వ కారణంగా అండర్‌పాస్ గుండా వెళ్లాలా వద్దా అనే సందిగ్ధంలో వాహనదారులు పడుతున్నారు. నీటి లోతు అంచనా వేయలేక కొందరు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. అండర్‌పాస్‌లో నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి నిల్వకు గల కారణాలను గుర్తించాలని, నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి వర్షానికీ ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుని రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని కోరుతున్నారు.

## ఎన్నికల కోడ్‌తో..

# రాజకీయ బ్యానర్ల తొలగింపు

- తిమడాం పంచాయతీలో అధికారుల ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు
- ఎక్కడైనా బ్యానర్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచన
- ఎన్నికల నియమావళి అమలుకు రాజకీయ ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి



**జలుమూరు, అక్టోబరు 15 (వార్త):** ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మండలంలోని వివిధ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్ల తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో కె. చిన్నమ్మడు తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ ప్రచార బ్యానర్లను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా తిమడాం పంచాయతీలో పంచాయతీ అభివృద్ధి అధికారి పి. సుశీల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. మండలంలోని ఏ ప్రాంతంలోనైనా రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు ఇంకా ఉన్నట్లయితే వాటిని గుర్తించి వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సూచించారు. ఎన్నికల నియమావళి అమలులో రాజకీయ ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.

# ఎన్నికల విధుల నిర్వహణలో లోపాలు జరగరాదు

* నిబంధనలు, మార్గదర్శకాలపై అవగాహన తప్పనిసరి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* పలాస, ఇచ్ఛాపురం మునిసిపల్ ఎన్నికల నిర్వహణపై ఫేజ్-1 శిక్షణ సమావేశం

**శ్రీకాకుళం, అక్టోబర్ 15(వార్త):** ఎన్నికల విధులు నిర్వహణలో లోపాలు జరగరాదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎలక్షన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం మునిసిపాలిటీలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా, జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి,స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన కలెక్టర్ సమావేశ మందిరంలో కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లతో ఫేజ్-1 ఎన్నికల నిర్వహణపై శిక్షణ సమావేశం వీడియో ప్రదర్శన ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో సంబంధిత అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మునిసిపల్ ఎన్నికలకు సంబంధించి ఫేజ్ -1 ఎన్నికల షెడ్యూల్, అక్టోబర్ 18 నామినేషన్ స్వీకరణ, అక్టోబర్ 19 తేదీన పరిశీలించి అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 21తేదిన నామినేషన్ తిరస్కరించబడుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు విధులు, బాధ్యతలు, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నియమ నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఫారం-బి, ఫారం-7 పరిశీలనలో పొలిటికల్ పార్టీ కేటగిరీ వారీగా పరిశీలించి, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చెక్ లిస్టు పరిశీలన తప్పనిసరి అని, తిరస్కరించబడిన నామినేషన్లు సంబంధించి అభ్యర్థి యొక్క సంతకంతో డిక్లరేషన్ తీసుకోని జవాబుదారీగా ఉండాలని అధికారులును ఆదేశించారు.ఈ శిక్షణ సమావేశంలో పలాస, ఇచ్ఛాపురం మునిసిపల్ కమిషనర్లు, శ్రీనివాసరావు, రమేష్, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరావు,సమగ్ర శిక్ష, ఎ.పి.సి , వేణుగోపాలరావు రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి..**

స్థానిక సంస్థల ఎన్నికలు-2026కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రకటన జారీ చేసిన నేపథ్యంలో, శ్రీకాకుళం జిల్లాలో సంబంధిత ఎన్నికల ప్రాంతాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 28 వార్డులు, పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీలో 36 వార్డులు కలిపి మొత్తం 64 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటర్లు ఆయా మున్సిపాలిటీల చైర్‌పర్సన్‌లను, వార్డు సభ్యులను ఎన్నుకుంటారు. ఈ నియమావళి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వర్తిస్తుంది. జిల్లాలోని మొత్తం 30 మండలాల తహసీల్దార్లను వారి బృందాలతో సహా ఆయా మండలాలకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎం సి సి) బృందాలను నియమించారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్లలో ఈ బృందాల పనితీరును జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షిస్తారు. ఇచ్ఛాపురం, పలాస తహసీల్దార్లు కూడా తమ బృందాలతో సంబంధిత మున్సిపాలిటీల పరిధిలో విధులు నిర్వహిస్తారు. తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో నియమావళి ఉల్లంఘనలపై కట్టుదిట్టమైన నిఘా ఉంచాలి. ప్రభుత్వ వాహనాలు, సిబ్బంది, వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించకుండా చూడాలి. ఉల్లంఘనలను వెంటనే జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారికి నివేదించాలి. తహసీల్దార్లు, ఎంపీడీవోలు తమ అధీనంలోని ఉద్యోగులు ఎవరూ ఎన్నికల ప్రచారం చేయకుండా, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా చూడాలని, అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పశువులతో పంట నష్టపోతున్నాం

**-కఠిన చట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు**

**-అధికారులు ప్రత్యేకంగా స్పందించాలి**

**-గిరిజనుల పంటలకు రక్షణ కల్పించాలి**



**మందస, అక్టోబరు 15(వార్త):** పశువులతో పంట నష్టపోతున్నాం... కఠిన చట్టాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. అధికారులు ప్రత్యేకంగా స్పందించి, గిరిజనుల పంటలకు రక్షణ కల్పించాలని గిరిజన రైతులు కోరుతున్నారు. అతివృష్టి, అనావృష్టిలతో తీవ్రంగా నష్టపోతున్నాం. అంతేకాదు.. అడవిజంతువులు కూడా పంటలను నష్టపరుస్తున్నాయి. లక్షల రూపాయల వ్యయం చేసి, అహర్నిశలు కష్టపడుతున్నాం. కానీ, పంట ఇంటికి రావడానికి ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నాం. వీటితో పాటు మరో పెద్ద సమస్య పశువులతో ఏర్పడిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలోని కిల్లోయి ప్రాంతంలో గల గ్రామాల రైతులు పశువులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పంటలకు నష్టం కలుగుతోందని కన్నీటి పర్యవంతమవుతున్నారు. పశువుల వల్ల రైతుల పంటలకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కిల్లోయి, కిల్లోయికాలనీ ప్రాంతంలోని రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతులు తమ సొంత ఖర్చులతో వాటర్ పంపులు ఏర్పాటు చేసుకొని వరి పంటలు, కూరగాయలు, జీడిమొక్కలు, మామిడి మొక్కలు తదితర పంటలను సాగు చేస్తున్నారు. కిల్లోయి, మందూరు, బీవైఆర్‌పురం తదితర గ్రామాల నుంచి కొంతమంది పశువుల యజమానులు తమ గేదెలను గ్రామ పరిసరాల్లోకి తీసుకువస్తుండటంతో, అవి రైతులు సాగు చేస్తున్న పంటలను తిని, మొక్కలను తొక్కి నాశనం చేస్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు ఎంతో కష్టపడి, అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నప్పటికీ, పశువుల వల్ల పంటలు దెబ్బతినడంతో వారి కుటుంబాల జీవనోపాధికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించాలన్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చి పంటలకు నష్టం కలిగిస్తున్న పశువుల సమస్యను పరిశీలించాలని, పశువుల యజమానులకు తగిన హెచ్చరికలు జారీ చేయాలని, పంటలకు నష్టం కలిగించే పశువుల యజమానులపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు అనుగుణంగా జరిమానాలు విధించేలా చర్యలు చేపట్టాలని, రైతులకు భవిష్యత్తులో ఇలాంటి నష్టాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. కాగా, పశువులతో నష్టం జరుగుతున్న విధానంపై సోషల్ మీడియాలో పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. రైతుల కష్టాలను, వారి జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని రైతుల కమిటీ నాయకులు కోరుతున్నారు.

## జనసేనలో చేరిన డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్

**- పలు పార్టీల్లో సాగిన ఆయన రాజకీయ ప్రస్థానం**

**- 2009లో ప్రజారాజ్యం తరఫున నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ**

**- 2014, 2019, 2024 ఎన్నికల్లో కూటమికి మద్దతు**



**నరసన్నపేట, అక్టోబరు 15 (వార్త):** జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్ డోల జగన్ తాజాగా జనసేన పార్టీలో చేరారు. గతంలో పలు రాజకీయ పార్టీల్లో కొనసాగిన ఆయన మరోసారి పార్టీ మారడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డోల జగన్ 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, ఆ తర్వాత చాలాకాలం రాజకీయంగా పెద్దగా క్రియాశీలకంగా కనిపించలేదు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన కూటమికి అనుకూలంగా పనిచేశారు. తాజాగా జనసేన పార్టీలో చేరడంతో ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వివిధ పార్టీల్లో పనిచేసిన అనుభవం ఉన్న డోల జగన్ జనసేనలో చేరడం నరసన్నపేట నియోజకవర్గ రాజకీయ పరిణామాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.




## జ్ఞానభారతిలో కలాం జయంతి

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 15 (వార్త):** ఇచ్ఛాపురంలోని జ్ఞాన భారతీ పాఠశాలలో సెక్రటరీ సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని అన్నారు. అత్యంత సాధారణ కుటుంబంలో జన్మించి, అత్యున్నతమైన రాష్ట్రపతి స్థాయికి ఎదిగి, ప్రతి క్షణం దేశం కోసం బ్రతికిన మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. అబ్దుల్ కలాం జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని అత్యున్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ ప్రమోద్ కుమార్ బెహరా, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ జ్యోతి బీమా పథకం కింద రూ.2 లక్షల ఆర్థిక సాయం

**- సారవకోట మండలానికి చెందిన పిర్ల రామారావు కుటుంబానికి బీమా పరిహారం మంజూరు**

**- నామినీ పిర్ల జయమ్మకు నగదు అందజేసిన ఏపీజీవీబీ మేనేజర్ వెంకటేశ్**

**- బీమా పథకంతో బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా**



**నరసన్నపేట, అక్టోబరు 15 (వార్త):** ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద సారవకోట మండలానికి చెందిన పిర్ల రామారావు కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ పేడాడా బీమా లబ్ధిదారు కుటుంబ నామినీ పిర్ల జయమ్మకు అందజేశారు. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా ఈ పరిహారం అందింది. బీమా పథకంలో చేరిన వారికి నిబంధనల ప్రకారం బీమా ప్రయోజనాలు అందుతాయని ఈ సందర్భంగా బ్యాంకు వర్గాలు పేర్కొన్నాయి. బ్యాంకు సిబ్బందితో పాటు బురదకొత్తూరు సీఎస్పీ టి. సుమతి బీమా పరిహారం అందజేత ప్రక్రియలో సహకరించారు. బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన కుటుంబాలకు సకాలంలో ప్రయోజనాలు అందేలా చూడటం ప్రాధాన్యమని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

## సారవకోట మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

**- ప్రకటించిన అధికారులు**

**- మహిళలు, ఎస్సీ, ఎస్టీ, జనరల్ కేటగిరీల వారీగా కేటాయింపులు**

**- ఎంపీడీవో కార్యాలయం వద్ద రిజర్వేషన్ల వివరాలు ఏర్పాటు**

**సారవకోట, అక్టోబరు 15 (వార్త):** సారవకోట మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు ఎంపీడీవో మురళీమోహన్ తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు కేటగిరీల వారీగా రిజర్వేషన్లు నిర్ణయించినట్లు బుధవారం వెల్లడించారు. గొర్రెబంద స్థానాన్ని ఎస్టీ మహిళకు, వాండ్రాయి, బుడితి, పెద్దలంబ, చీడిపూడి, కేలవలస, సారవకోట, చిన్న కిట్టాలపాడు స్థానాలను సంబంధిత రిజర్వేషన్ వివరాల ప్రకారం కేటాయించారు. మాలువ, గుమ్మపాడు స్థానాలను జనరల్ మహిళలకు, కిన్నెరవాడ, కుమ్మరిగుంట స్థానాలను జనరల్ కేటగిరీకి కేటాయించారు. బద్రి స్థానాన్ని ఎస్సీ మహిళకు, అలుదు స్థానాన్ని ఎస్సీ కేటగిరీకి, జమచక్రం స్థానాన్ని ఎస్టీ కేటగిరీకి రిజర్వు చేసినట్లు వివరించారు. మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల పూర్తి వివరాలను ఎంపీడీవో కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచినట్లు మురళీమోహన్ పేర్కొన్నారు. సంబంధిత గ్రామాల ప్రజలు, ఆసక్తి గల అభ్యర్థులు కార్యాలయంలో వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.



## అర్హులైన విచారణ ఖైదీలకు బెయిల్ మంజూరు వేగవంతం చేయాలి

**శ్రీకాకుళం, అక్టోబర్ 15 (వార్త):** జైళ్లల్లో సుదీర్ఘకాలంగా మగ్గుతున్న అర్హులైన విచారణ ఖైదీలకు చట్టప్రకారం త్వరితగతిన బెయిల్ మంజూరయ్యేలా చూడటంతో పాటు, నిరుపేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించడంలో అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు సునీత కొండబోలు ఆదేశించారు. స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో గురువారం ఆమె అధ్యక్షతన అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ (యుటిఆర్సి) జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైలులో ఉన్న విచారణ ఖైదీల కేసుల స్థితిగతులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, బెయిల్ పొందేందుకు అర్హత కలిగిన ఖైదీల వివరాలు, వారికి అందుతున్న ఉచిత న్యాయ సహాయంపై కమిటీ సభ్యులతో సమగ్రంగా సమీక్షించారు. విచారణ ప్రక్రియను వేగవంతం చేసి బాధితులు, ఖైదీలకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, అడిషనల్ ఎస్పీ పి. శ్రీనివాసరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ జి. మధుబాబు, ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తల్లీ కిల్లమ్మ.. చల్లగా చూడమ్మ..!

**- రాజావారి కోటలో ఆధ్యాత్మిక సందడి**

**- కిల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు**



**మందస, అక్టోబరు 15(వార్త):** తల్లీ కిల్లమ్మ.. చల్లగా చూడమ్మ.. అంటూ భక్తులు శ్రీకిల్లమ్మతల్లిని పూజిస్తున్నారు. పంటలు చక్కగా పండాలని, కిల్లమ్మ కరుణ ప్రజలపై ఉండాలని వేడుకుంటున్నారు. రాజుల కాలం నుంచి ఆనవాయితీ వస్తున్న శ్రీకిల్లమ్మతల్లి పూజలు మందస పట్టణంలోని శ్రీరాజావారి కోట ఆవరణగా భక్తి, శ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. మందసలో గ్రామ ఇలవేల్పు కిల్లమ్మ దేవత ఉత్సవాలు 16 రోజులు పాటు మందస రాజావారి కోట ప్రాంగణంలో జరుగుతాయి. మందస సంస్థానాన్ని పరిపాలించిన రాజుల పాలనలో రాజుల దైవమైన ఈ దేవతను ఈ ప్రాంతం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించేవారు. మందస మండలంలోని పిడిమందసలో గల శ్రీకిల్లమ్మతల్లి దేవాలయం నుంచి ఈ దేవత శిలా విగ్రహమూర్తిని మందసకు తీసుకువస్తారు. అప్పటి నుంచి మందసలో 16రోజుల పాటు కిల్లమ్మతల్లి భక్తుల పూజలు అందుకుంటుంది. మందస రాజా వారి కోట ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ గదిలో ఈ దేవతకు సంబంధించిన శిలా విగ్రహ మూర్తిని అమర్చుతారు. కిల్లమ్మతల్లి దేవత జన్మస్థలం ఒడిశా రాష్ట్రం పరిధిలో ఉన్న మహేంద్రగిరి పర్వత శ్రేణుల దిగువన ఉన్న డింబగా గిరిజన గ్రామంలో ఉందని భక్తులు చెబుతున్నారు. ఈ గ్రామంలో భక్తులు ప్రత్యేక ఆలయాన్ని ఈ దేవత కోసం నిర్మించారు. శిలా విగ్రహాలు ఇప్పటికీ చెక్కు చెదరని విధంగా ఆలయం ప్రాంగణంలో ఉన్నాయి. ఈ ఆలయానికి అర్చకులుగా గిరిజనుడైన సవర చిన్న భారీకో వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు ఇక్కడ ఈ దేవత ఆలయం తలుపులు తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహేంద్రగిరిలకు వెళ్లే రహదారి పక్కనే ఈ దేవత ఆలయం ఉండటం విశేషం. మందసలో కిల్లమ్మతల్లి 16రోజుల పాటు భక్తుల పూజలు అందుకుంటుంది. ప్రతీ రోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాగా, కిల్లమ్మతల్లి మళ్లీ పిడిమందస తిరిగి వెళ్లిన రోజున మందసలో దసరా ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ వస్తోంది.





## గార మండల జడ్పీటీసీ బరిలో బడి శ్రీరాములు

**✲ జనసేన పార్టీ తరఫున పోటీకి ప్రయత్నం ✲ అవకాశం రాకుంటే స్వతంత్రంగా బరిలోకి**

**✲ మత్స్యకారుల హక్కుల సాధనకు కృషి చేస్తా ✲ జనసేన నాయకుడు బడి శ్రీరాములు**

**శ్రీకాకుళం/గార, అక్టోబర్ 15 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గార మండల జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బడి శ్రీరాములు సిద్ధమవుతున్నారు. బందరువానిపేట గ్రామానికి చెందిన ఆయన జనసేన పార్టీ తరఫున బరిలో దిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ నుంచి అవకాశం లభించకపోతే రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని, గార మండల ప్రజలు, మత్స్యకార సోదరులు తనకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండల స్థాయిలో మత్స్యకారులకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తే, తమకు అవసరమైన రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేయడంతో పాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో మత్స్యకారుల సమస్యలను బలంగా వినిపించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మండల పరిధిలో ఏ మత్స్యకారుడు ఎన్నికల్లో పోటీ చేసినా, వారికి తన వంతు సహకారం అందిస్తానని బడి శ్రీరాములు హామీ ఇచ్చారు. మత్స్యకారుల హక్కులు, సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే బందరువానిపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు కూడా తన తరఫున అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా స్థానాల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసేందుకు కృషి చేస్తామని, పార్టీ అవకాశం కల్పించని పక్షంలో ప్రత్యామ్నాయంగా జనసేన రెబల్ అభ్యర్థులుగా పోటీకి సిద్ధమవుతామని తెలిపారు. జనసేన.. జనుల కోసం.. జనసేవ కోసం అనే నినాదంతో ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని బడి శ్రీరాములు, మండల ప్రజలు, ముఖ్యంగా మత్స్యకార సోదరులు తనకు మద్దతుగా నిలవాలని కోరారు.






## మెళియాపుట్టి జనసేన జడ్పీటీసీ అభ్యర్థిగా గోపమ్మ

**✲ ఆమె జనసేన నేత దుక్క బాలరాజు భార్య ✲ కొరికాన దంపతులకు బాలరాజు నమ్మకమైన వ్యక్తి ✲ గోపమ్మను ఖరారు చేసినట్టు సమాచారం ✲ ఆమెకు పార్టీ పెద్దల మద్దతు**

**మెళియాపుట్టి, అక్టోబర్ 15 (వార్త):** మెళియాపుట్టి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా సీనియర్ జనసేన నాయకుడు దుక్క బాలరాజు భార్య నక్క గోపమ్మ బరిలో ఉన్నారు. ఆమె పేరును కూడా ఖరారు చేసినట్టు సమాచారం. ఆమె తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళ. భర్త బాలరాజు యాదవ సామాజిక వర్గంనకు చెందినవారు. జన సేన పార్టీ ఆవిర్భావం నుంచి దుక్క బాలరాజు ఆ పార్టీలో సేవలు అందిస్తు న్నారు. 2014 నుండి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ బలో పేతానికి ఎనలేని సేవలు చేస్తున్నారు. అతని వెంట భార్య నక్క గోపమ్మ కూడా పార్టీ బలోపేతానికి తనవంతు సాయం అందిస్తు న్నారు. పాత పట్నం నియోజకవర్గం జనసేన నాయకులు కొరికాన భవాని, సుడా చైర్మన్ రవికుమార్‌కు సన్నిహితులుగా బాలరాజు ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నందిగాం జడ్పీటీసీ రేసులో బలగం

- అధిష్ఠానం అవకాశం కల్పిస్తే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధం..
- జగన్‌కు వీరాభిమాని
- వైఎస్సార్‌సీపీపై అచంచల విశ్వాసం

**పలాస, అక్టోబరు 15 (వార్త):** నందిగామ మండల జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడి అభ్యర్థిత్వం చుట్టూ రాజకీయ చర్చ మొదలైంది. ఈ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బడగం గ్రామానికి చెందిన బలగం గోవిందు పేరు తెరపైకి వచ్చినట్ల రాజకీయ పండితులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు . పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తే ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లు అనుచర వర్గాలు తెలిపాయి. ఆయన అభ్యర్థిత్వంపై పార్టీ నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదని, నేడు రేపు అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని రాజకీయ పండితు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వీరాభిమానిగా, పార్టీ పట్ల అచంచల విశ్వాసంతో పనిచేసే నాయకుడిగా బలగం గోవిందుకు స్థానికంగా గుర్తింపు ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. సౌమ్య స్వభావం, మితభాషిత్వం, అందరితో స్నేహపూర్వకంగా మెలిగే తత్వం ఆయనకు ప్రత్యేకతగా నిలుస్తున్నాయని, కార్యకర్తలకు నిత్యం అండగా ఉండే తత్వం కలిగిన వాడినని ఆయన అనుచరులు చెబుతున్నారు. పార్టీ పట్ల విధేయతను రాజకీయ ప్రస్థానంలో కీలకంగా భావిస్తున్న గోవిందు, అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా ముందుకు సాగాలనే ఆలోచనలో ఉన్నారని రాజకీయ పండితులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు పార్టీ విధేయతతో పాటు ప్రజలతో ఉన్న సంబంధాలు, స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజాసేవ పట్ల నిబద్ధత వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయి. ఈ నేపథ్యంలో నందిగామ మండలంలో బలగం గోవిందుకు ఉన్న పరిచయాలు, పార్టీ శ్రేణులతో ఆయనకున్న అనుబంధం అభ్యర్థిత్వ చర్చలో ప్రస్తావనకు వస్తున్నాయని రాజకీయ మేధావి వర్గం అంటున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కాలంటే పార్టీ నాయకత్వం నిర్ణయమే కీలకం కానుంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నందిగామ మండలంలో రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది. బలగం గోవిందుకు పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తారా? లేక మరో నాయకుడి వైపు అధిష్ఠానం మొగ్గు చూపుతుందా? అన్నది ప్రస్తుతానికి ప్రజలు ఆలోచిస్తున్నారు. అభ్యర్థిత్వం ఖరారయ్యే వరకు ఈ చర్చలు రాజకీయ వర్గాల్లో అంచనాలకే పరిమితం కానున్నాయి. పార్టీ నాయకత్వం తీసుకునే తుది నిర్ణయం గోవిందు రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వనుందని రాజకీయ కోవిదులు అంటున్నారు.



## మందస గ్రామ పురోహితులు రామచంద్రమూర్తి మృతి

-సంతాపం తెలిపిన నాయకులు, ప్రజలు



**మందస, అక్టోబరు 15(వార్త):** మందస పట్టణ గ్రామ పురోహితులు కొమ్మాజోస్యుల రామచంద్రమూర్తి(74) మరణించారు. మందస పట్టణంలోనే కాకుండా ఈ ప్రాంతంలో రామచంద్రమూర్తి మంచి జ్యోతిష్కులు. మందసలో ఏ కార్యక్రమం, కార్యం చేయాలన్నా, చేపట్టలన్నా.. రామచంద్రమూర్తి కుటుంబాన్నే స్థానికులు ఆశ్రయిస్తారు. రామచంద్రమూర్తి తండ్రి కేఏపంతులు మందస వచ్చి స్థిరపడ్డారు. కేఏపంతులని, తెలుగు పంతులని ఆయనను పిలిచేవారు. కేఏపంతులు వారసత్వంగా రామచంద్రమూర్తి గ్రామ పౌరోహిత్యం కొనసాగించారు. రామచంద్రమూర్తిని కూడా తెలుగుపంతులు అనే పిలిచేవారు. ఆయనకు ముగ్గురు కుమారులు. రమేష్, గణేశ్, సీతారామశర్మ(రవిసాయిపంతులు) ఉన్నారు. రామచంద్రమూర్తి మరణించడంతో స్థానికులు ఆ కుటుంబానికి సంతాపం తెలిపారు. కుమారులకు సానుభూతి తెలిపారు.

## స్థానిక ఎన్నికలతో త్రిబుల్ ఇంజిన్ సర్కారు



**సరుబుజ్జిలి, అక్టోబరు 15(వార్త):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలతో కూటమి ప్రభుత్వం త్రిబుల్ ఇంజిన్ సర్కారుగా మారి గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కూన సంజయ్ అన్నారు. ఎన్నికల నగారా మోగడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొందన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా సాగుతోందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల అనంతరం సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని, శ్రీకాకుళం జిల్లాను స్వర్ణ శ్రీకాకుళంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమ వుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమదాలవలస నియోజకవర్గం మున్సిపల్ ఎన్నికలు జరగడానికి కూన రవికుమార్ కృషి దోహదపడిందన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## మెడికల్ షాపుల్లో తనిఖీలు




**సోంపేట, అక్టోబరు 15(వార్త):** ఆపరేషన్ గరుడ లో భాగంగా సోంపేట పట్టణంలో గురువారం డ్రగ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఈగిల్ సెల్ సిబ్బంది కలిసి మెడికల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు డ్రగ్స్ తనిఖీ చేసి అలాగే రికార్డులు కూడా పరిశీలించారు. హెచ్ వన్ రిజిస్టర్, మత్తు మందుల కొనుగోలు, అమ్మకాల బిల్లులను పరిశీలించారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. లేనియెడల తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భవానీ పూజల్లో మాజీ ఎంపీపీ




**కంచిలి, అక్టోబరు 15(వార్త):** కంచిలి మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు గురువారం భవాని పూజల్లో పాల్గొన్నారు. పెద్ద శ్రీరామ పురం పంచాయతీ చెమల్ల పుట్టుగ గ్రామంలో గుండా శివకుమార్ తనయుడు నిర్వహించిన దుర్గా పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవాని భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు.

## కొర్లాంలో కుంకుమ పూజలు

**సోంపేట, అక్టోబరు 15(వార్త):** కొర్లాం గ్రామంలో దుర్గా నవరాత్రులలో భాగంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో గురువారం అనేకమంది మహిళలు దుర్గా పూజా మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు పూర్ణచంద్ర పాణిగ్రాహి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.






## పలాస ప్రభుత్వాసుపత్రిలో మెగా వైద్య శిబిరం

- 170 మందికి వైద్య పరీక్షలు
- వివిధ విభాగాల నిపుణుల సేవలు

**పలాస, అక్టోబరు 15 (వార్త):** కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు పలాసలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం నెల రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెంట్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి. పాపినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 170 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. మెగా వైద్య శిబిరంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొని రోగులకు సేవలందించారు. సాధారణ వైద్య సేవలను డాక్టర్ సీహెచ్ రఘురాం, ఎముకలు, కీళ్ల వైద్య సేవలను డాక్టర్ ఆర్. చిన్ననాయుడు, సాధారణ వైద్య విభాగంలో డాక్టర్ కె. మోహన్‌బాబు అందించారు. స్త్రీ, ప్రసూతి వైద్య విభాగంలో డాక్టర్ సుశీల, చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలకు డాక్టర్ బొడ్డేపల్లి రమ్య, కంటి వైద్య సేవలను డాక్టర్ నాగశ్రీరేఖ అందించారు. మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ మనోహర్, దంత వైద్యురాలు డాక్టర్ అపర్ణ, నవజాత శిశు వైద్య నిపుణుడు డాక్టర్ వినోద్‌కుమార్, సాధారణ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ స్వరూప్, అసంక్రమిత వ్యాధుల విభాగంలో డాక్టర్ జ్యోత్స్న, చిన్నపిల్లల వైద్య విభాగంలో డాక్టర్ చాందిని పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో రోగులకు తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు చేయించుకునే అవకాశం లభించిందని రోగులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచిత వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడం, వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన వైద్య సలహాలు అందించడం ఇటువంటి శిబిరాల ప్రధాన ఉద్దేశమని అన్నారు. వివిధ విభాగాల వైద్యులను సంప్రదించాల్సిన రోగులకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన నర్సు ఉమాదేవి, జూనియర్ సహాయకుడు ఉదయ్‌కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొని శిబిర నిర్వహణకు సహకరించారు.

## నడకే దివ్య ఔషధం..

## ఆరోగ్యానికి ఆయువు పట్టు

- ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు

**శ్రీకాకుళం, అక్టోబరు 15(వార్త):** ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా, ఉత్సాహంగా, నిత్యయవ్వనంగా ఉండాలంటే నడకను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నడక శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, మెదడు చురుకుదనానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. నడవండి.. నడిపించండి.. నవశకానికి నాంది పలకండి' అనే నినాదంతో 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ అనేక కార్యక్రమాల ద్వారా పురోగతి సాధించిందని, సామాజిక సేవలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. నవంబర్ 1వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ వార్షికోత్సవ వేడుకలకు ఆత్మీయ అతిథిగా హాజరుకావాలని కోరుతూ గురువారం స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ సూర శ్రీనివాసరావును ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనతో సమావేశమై కార్యక్రమ వివరాలను తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ కొంత సమయం నడకకు కేటాయించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. నడక వల్ల శరీరానికి చురుకుదనం లభించడంతో పాటు మెదడు పనితీరు మెరుగుపడేందుకు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నడకను అలవాటు చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా ఈ అలవాటును ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో వాకర్స్ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అనంతరం స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ సూర శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. నవంబర్ 1న జరగనున్న 40వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడ, గేదెల లక్ష్మి, పిజి గుప్తా, ఎస్ సంజీవరావు , జి జగ్గారావు,తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



## దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలకు శ్రీధర్‌బాబా విరాళం

- రూ.5 వేల ఆర్థికసాయం అందజేత




**పలాస, అక్టోబరు 15 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక పరిధిలోని పలాస జీజే కళాశాల ప్రాంతంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ దుర్గామాత నవరాత్రి మహోత్సవాలకు పలాస నియోజకవర్గ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శివాజీనగర్ షిరిడీ సాయిబాబా సంస్థ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ బాబా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీధర్ బాబా మాట్లాడుతూ శ్రీ కనకదుర్గమ్మవారి దివ్య ఆశీస్సులు పలాస నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతోపాటు, సమాజంలో ఐక్యతా భావాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. విజయదశమి పర్వదినం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, పలాస నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంతబొమ్మాళి ఎంపీటీసీల రిజర్వేషన్లు ఖరారు

**సంతబొమ్మాళి, అక్టోబరు 15(వార్త):** సంతబొమ్మాలి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా 20 ఎంపీటీసీ స్థానాల్లో రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు ఎంపీడీవో బి పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు.ఇందులో చిన్న తుంగాం ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీ లకు కేటాయించాగా, దండు గోపాలపురం, కస్పా నౌపడ 2, లక్కీ వలస,పాలతలగాం ఉమిలాడ ఎంపీటీసీ స్థానాలను బీసీ మహిళలకు కేటాయించారు. అలాగే మర్రిపాడు, భావనపాడు, బోరుభద్ర, గోవిందపురం బీసీ జనరల్ కు కేటాయించారు.అలాగే హెచ్‌ఎం పేట, కే లింగూడు, మేఘవరం, సంతబొమ్మలి 2, నరసాపురం స్థానాలను అన్ రిజర్వుడ్ మహిళలకు కేటాయించారు. అలాగే వడ్డీ తాండ్ర, కే నౌపడ 1, మలగాం, సంతబొమ్మాలి 1,ఆర్ హెచ్ పురం, ఎంపీటీసీ స్థానాలను అన్ రిజర్వుడ్ ఆల్ కు కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన రిజర్వేషన్లు ప్రాప్తికి అభ్యర్థులు ఆయా స్థానాల్లో పోటీ చేయడానికి అర్హులని వివరించారు.

## పంచాయతీ రిజర్వేషన్లపై తీవ్ర ఆందోళన

-సరుబుజ్జిలి మండలం పెద్దపాలెంలో రగడ
- రొటేషన్ పద్ధతిని విస్మరించి మళ్లీ అదే వర్గానికి కేటాయించడంపై వ్యతిరేకత
- అన్‌రిజర్వుడ్ లేదా మహిళా కేటగిరీగా మార్చాలని గ్రామస్థుల విజ్ఞప్తి

(సరుబుజ్జిలి)



సరుబుజ్జిలి మండలంలో త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ వివాదాస్పదంగా మారుతోంది. సరుబుజ్జిలి మండలంలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు ఉండగా, మొదటి విడత కింద నవంబర్ 26 న ఎన్నికలు జరగనున్నాయి. అయితే, మండలంలోని పెద్దపాలెం గ్రామ పంచాయతీ రిజర్వేషన్ విషయంలో అన్యాయం జరుగుతోందని స్థానికులు, అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రొటేషన్ నిబంధనల ఉల్లంఘన: పెద్దపాలెం గ్రామ పంచాయతీని గతంలోనే రొటేషన్ పద్ధతిలో ఎస్సీ గ్రామ పంచాయతీగా రిజర్వ్ చేయడం జరిగింది. అయితే ఇక్కడ తక్కువ షెడ్యూల్డ్ కులాల జనాభా ఉన్నా రిజర్వేషన్ను పునరావృతం చేశారని స్థానికులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో కూడా అదే పెద్దపాలెం పంచాయతీని మళ్లీ ఎస్సీ రిజర్వేషన్ కిందకే కేటాయించేందుకు కొన్ని రాజకీయ వర్గాలు తెరవెనుక ప్రయత్నాలు పూర్తిస్థాయిలో సమాచారం అందుకున్న గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించాలా అనే ఆలోచన చేస్తున్నారు.

### ఇతర గ్రామాలను విడిచిపెట్టడంపై విమర్శలు

మండలంలో ఇంతవరకు రొటేషన్‌లో ఎస్సీ రిజర్వేషన్‌కు నోచుకోని ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న ఇతర గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ, వాటిని వదిలిపెట్టి తక్కువ జనాభా ఉన్న పెద్దపాలెంను మళ్లీ అదే కేటగిరీకి కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, రిజర్వేషన్ల ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పెద్దపాలెం గ్రామ పంచాయతీని ఎస్సీ రిజర్వేషన్‌కు బదులుగా అత్యధిక జనాభా ఉన్న బీసీ లేదా అన్‌రిజర్వుడ్ లేదా మహిళా రిజర్వేషన్ కింద కేటాయించి, తమకు తగిన న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు. లేదంటే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తప్ప తమకు వేరే మార్గం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546